క్లుప్తంగా

ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరణ



ఫిర్యాదును పరిశీలిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ: జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి ఫిర్యాదుదారుల సమస్యలను విని వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల నుంచి అర్జీలను స్వీకరించి వాటికి తక్షణ పరిష్కారం కోసం సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిష్కారానికి సూచనలు చేశారు. ప్రజలు మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా స్వచ్ఛందంగా పోలీస్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు.

పరీక్షలంటే ఆందోళన చెందొద్దు

పెద్దశంకరంపేట(మెదక్): విద్యార్థులు పరీక్షలంటే ఆందోళన చెందొద్దని సైకాలజిస్ట్ నవీన్ అన్నారు. సోమవారం పెద్దశంకరంపేటలోని బాలికల ప్రాథమిక పాఠశాలలో ఎస్సెస్సీ విద్యార్థులకు ప్రేరణ కల్పించారు. పరీక్షల్లో ఎలాంటి ఒత్తిడికి లోను కాకుండా, భయాందోళనకు గురికాకుండా లక్ష్యాన్ని నిర్దేశించుకొని పరీక్షలను రాయాలని సూచించారు. కష్టపడితినే బంగారు భవిష్యత్ లభిస్తుందని ఎంఈఓ వెంకటేశం అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సిద్ధిరాములు, అశ్విని, రాణి, లక్ష్మి, భారతి, నాగవేణి, రాజు తదితరులున్నారు.

‘విద్యుత్ అందించండి’

పెద్దశంకరంపేట(మెదక్): వ్యవసాయానికి నిరంతరాయంగా విద్యుత్‌ను సరఫరా చేయాలని కోరుతూ మండల పరిధిలోని గొట్టిముక్కల గ్రామానికి చెందిన రైతులు సోమవారం విద్యుత్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. విద్యుత్ సరఫరాలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, దీనితో పంటలు ఎండిపోతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి నిరంతరాయంగా విద్యుత్‌ను అందించి తమ పంటలను కాపాడాలని విద్యుత్ అధికారులకు వినతిపత్రం అందజేశారు.

తండ్రి కొడుకులపై కేసు నమోదు

శివ్వంపేట(నర్సాపూర్): విద్యుత్ సిబ్బంది విధులకు ఆటంకం కల్గించడంతో పాటు వారిపై దాడికి పాల్పడిన తండ్రి కొడుకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మధుకర్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని సీతారాం తండాకు చెందిన రాంసింగ్ ఇంటి నిర్మాణానికి విద్యుత్ మీటర్ లేకుండా అక్రమంగా విద్యుత్ వాడుతుండడంతో గుర్తించిన విద్యుత్ లైన్‌మెన్ సురేశ్, సిబ్బంది యాదగిరి తొలగించేందుకు సోమవారం వెళ్లారు. విద్యుత్ వైర్లు తొలగిస్తున్న సిబ్బందిపై రాంసింగ్ అతని కొడుకు రాజేందర్ బూతులు తిడుతూ దాడి చేశారు. లైన్‌మెన్ సురేశ్ ఫిర్యాదు మేరకు అక్రమంగా విద్యుత్ చౌర్యంతో పాటు సిబ్బంది పై దాడికి పాల్పడిన తండ్రి కొడుకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు.

ముందస్తు అరెస్టు హేయమైన చర్య

తూప్రాన్: జిల్లాలో ముందస్తుగా ఆర్టిజన్‌లను అరెస్టు చేయడం హేయమైన చర్య అని జిల్లా యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర టీవీఏసీ జేఏసీ ఎలాంటి అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం లేకున్నా అరెస్టు చేయడం సమంజసం కాదన్నారు. సమావేశంలో జిల్లా టీజీయూఈఈయూ సీఐటీయూ అధ్యక్షుడు నర్సింలు, వైస్ ప్రెసిడెంట్ నాగరాజు, యాదగిరి పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

టేక్మాల్(మెదక్): మండలంలోని తంప్లూర్‌లో భ్రమరాంబ మల్లికార్జునస్వామి వార్షికోత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా గణపతిపూజ, రుద్రాభిషేకం, స్వామివారి కల్యాణోత్సవం వేదమంత్రాలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, మాజీ ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ మఠం భిక్షపతి, నాయకులు జైపాల్‌రెడ్డి తదితరులు హాజరై పూజలు నిర్వహించారు.

ప్రభుత్వ కళాశాలలో చేరండి

నర్సాపూర్ రూరల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరాలని కోరుతూ సోమవారం నర్సాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దామోదర్ ఆధ్వర్యంలో సోమవారం అధ్యాపకులు ప్రచారం నిర్వహించారు. ముందుగా కళాశాల వద్ద డిగ్రీ కళాశాలలో ఉన్న సదుపాయాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ కళాశాలలో అనుభవం ఉన్న అధ్యాపకులతో విద్యా బోధన, సర్టిఫికెట్ కోర్సులు, క్రీడా విభాగం, ఎన్ఎస్ఎస్ యూనిట్స్, డిజిటల్ టీచింగ్ విధానం, ఆధునిక లైబ్రరీ, ప్రయోగశాలలో అన్ని విధాలుగా విద్యాబోధన నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అధ్యాపకులు సమీరా, అదెప్ప, సురేశ్‌కుమార్, రుక్మిణి, శ్రీనివాస్, మహేందర్ రెడ్డి, హేమంత్, రాజు తదితరులు ఉన్నారు.



కాడిపల్లిలో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఆశవర్కర్లు



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆశవర్కర్లు

ఆశవర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలి

కౌడిపల్లి(నర్సాపూర్): ఆశవర్కర్లకు రూ. 18వేలు ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలని మండల ఆశవర్కర్ల సంఘం అధ్యక్షురాలు చెన్నమ్మ డిమాండ్ చేశారు. సోమవారం కౌడిపల్లిలో తహసీల్దార్, పీహెచ్‌సీ డాక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆశవర్కర్లతో ప్రభుత్వం వెట్టిచాకిరి చేయిస్తుందన్నారు. ఆశవర్కర్లకు ఎలాంటి టార్కెట్‌లు లేకుండా రూ. 18వేలు ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అర్హులకు ఏఎన్ఎంగా పదోన్నతి ఇవ్వాలన్నారు. రూ. 50లక్షలు బీమా కల్పించాలన్నారు. ఆదివారం, పండగ సెలవులు ఇవ్వాలని తెలిపారు. దీంతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశవర్కర్ల సంఘం నాయకులు శ్యామల, నీరజ, వినోద, అనిత తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

శివ్వంపేట(నర్సాపూర్): ఆశా వర్కర్లు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. తమ న్యాయమైన సమస్యల పరిష్కరించాలని ఆశా వర్కర్లు పద్మ, లక్ష్మీ, రేణుక, వీరమణి, స్వప్న, భాషమ్మ డిమాండ్ చేశారు. ప్రస్తుత అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోనే ఆశా వర్కర్స్‌కు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలని, ఇతర సమస్యలు పూర్తిస్థాయిలో తీర్చాలని డిమాండ్ చేశారు. అందుకు సంబంధించిన సమస్యలతో కూడిన వినతిపత్రం తహసీల్దార్ కమలాద్రికి అందజేశారు.

ఉపాధ్యాయులను విచారించిన ఎంఈఓ



ఉపాధ్యాయులను విచారిస్తున్న ఎంఈఓ బుచ్చనాయక్

సాక్షి ఎఫెక్ట్

శివ్వంపేట(నర్సాపూర్): శివ్వంపేట ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు సమయపాలన పాటించని విషయమై సాక్షి దినపత్రికలో ఆదివారం ప్రార్థనకు టీచర్లు డుమ్మా అనే కథనం ప్రచురితమైంది. దీంతో జిల్లా విద్యాధికారి రాధాకిషన్ స్పందించారు. సోమవారం ఎంఈఓ బుచ్చనాయక్ పాఠశాలలో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. శనివారం ఉదయం పాఠశాలలో నిర్వహించిన ప్రార్థనకు 17 మంది ఉపాధ్యాయులు ఉండగా, ఆరుగురు మాత్రమే హాజరుకాక మిగతా 11 మంది ఉపాధ్యాయులు హాజరుకాక పోవడంతో వారి వివరణ తీసుకున్నారు. ఇందుకు సంబంధించి వివరాలు డీఈఓకు నివేదించనున్నట్లు ఎంఈఓ బుచ్చనాయక్ సాక్షితో చెప్పారు.

డంప్‌యార్డును రద్దు చేయాలి

అసెంబ్లీలో ఎమ్మెల్యే సునీతారెడ్డి విజ్ఞప్తి



నర్సాపూర్: సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల్ల మండలం ప్యారానగర్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న డంప్‌యార్డును రద్దు చేయాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం రాష్ట్ర శాసనసభలో ఆమె మాట్లాడుతూ.. డంప్‌యార్డుతో నర్సాపూర్‌తో పాటు మూడు మండలాలు ఇబ్బందులకు గురవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. గుమ్మడిదల్ల మండలం నల్లవల్లి, కొత్తపల్లి గ్రామాల మధ్య ఉన్న 152 ఎకరాల భూమి గ్యాప్ ల్యాండ్స్ అని అధికారులు చెప్పి అక్కడే డంప్‌యార్డు ఏర్పాటు చేస్తున్నారని చెప్పారు. 152ఎకరాల భూములు గ్యాప్ ల్యాండ్స్ కావని కొత్తపల్లి, నల్లవల్లికి చెందిన అటవీ భూముల పరిధిలోనే ఆ భూములు ఉన్నాయని, రెండు గ్రామాల అటవి భూములను సర్వే చేస్తే డంప్‌యార్డు ఏర్పాటు చేయతలపెట్టిన భూముల వివరాలు తేలుతాయని వివరిస్తూ రెండు గ్రామాల పరిధిలోని అటవి భూములను సర్వే చేయించాలని అటవీ శాఖ మంత్రిని కోరారు. కాగా డంప్‌యార్డుపై ప్రస్తుతం కోర్టు స్టే ఉందని వివరిస్తూ ప్రభుత్వం డంప్‌యార్డును రద్దు చేయాలని సభలో ప్రభుత్వాన్ని కోరారు. ఎమ్మెల్యే అభ్యర్థనపై మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందిస్తూ ఎమ్మెల్యే చెప్పిన అంశాన్ని పరిశీలిస్తామని సభలో ప్రకటించారు.

రూ. 1.85 లక్షలు దుర్వినియోగం

పాపన్నపేట(మెదక్): మండలంలో గతేడాది నిర్వహించిన ఉపాధి పనుల్లో రూ. 1.85 లక్షలు దుర్వినియోగం అయినట్లు డీఆర్డీఓ శ్రీనివాస్‌రావు తెలిపారు. 2023–24 సంవత్సరానికి సంబంధించి జరిగిన ఉపాధి పనులపై పాపన్నపేటలో సోమవారం 14వ సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో ఉపాధి హామీ ద్వారా రూ. 4.44 కోట్ల విలువైన 267 పనులు జరిగినట్లు తెలిపారు. వాటిలో కూలీలకు రూ. 4.25 కోట్లు, వస్తు సామగ్రికి రూ.19.06 లక్షలు వెచ్చించారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా మొత్తం రూ. 4.92 కోట్లతో 60 పనులు జరగగా, వాటిలో సామగ్రికి రూ. 4.92 కోట్లు, కూలీలకు రూ.35 వేలు చెల్లించారు. రూ.1.85 లక్షలు దుర్వినియోగం అయినట్లు గుర్తించారు. వాటిని రికవరీ చేయడంతో పాటు రూ. 74,500 జరిమానా విధించారు. కార్యక్రమంలో డీవీఓ శ్రీహరి, మండల ప్రత్యేక అధికారి సురేష్‌బాబు, ఎంపీడీఓ విష్ణువర్ధన్, ఎంపీఓ పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్న అధికారులు

లైఫ్ సర్టిఫికెట్లు అందచేయాలి

నర్సాపూర్: ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగులు తమ లైఫ్ సర్టిఫికెట్లు ఈనెల 31 వరకు అందజేయాలని రిటైర్డు ఉద్యోగుల సంఘం ప్రతినిధులు సత్యనారాయణ, గంగరాం తెలిపారు. ఈనెల 31లోపు రిటైర్డు ఉద్యోగులందరూ తమ లైఫ్ సర్టిఫికెట్లను ఎస్‌టీఓ కార్యాలయంలో అందజేయాలని వారు చెప్పారు. పింఛన్ సక్రమంగా పొందడానికి అందరు తమ లైఫ్ సర్టిఫికెట్లు అందజేయాలని వారు కోరారు.

కరెంట్ వైరు ఇవ్వడం లేదు

నర్సాపూర్: తన సొంత నిధులతో కరెంట్ స్తంభాలు ఏర్పాటు చేసినా.. కరెంట్ వైరు ఇవ్వడం లేదని బీజేపీ నాయకుడు రమేశ్‌యాదవ్ ఆరోపించారు. ఆయన మాట్లాడుతూ.. రెండో వార్డులో పలు వీధుల్లో కరెంట్‌స్తంభాలు, వీధి దీపాలు లేక అంధకారం ఉండడంతో తన సొంత నిధులతో 13 కరెంట్ స్తంభాలు కొనుగోలు చేసి, తెచ్చి అవసరం ఉన్న చోట ఏర్పాటు చేశానని తెలిపారు. ఆయా స్తంభాలకు కరెంట్ వైరు లాగి కరెంట్ సరఫరా చేయాలని విద్యుత్ శాఖ, మున్సిపల్ అధికారులను పలుమార్లు కోరినా వారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. ప్రజల అవసరాలను గుర్తించిస్తంభాలకు వైరు లాగాలని ఆయన కోరారు.

తైబజార్ ఆదాయ రూ. 5.29 లక్షలు

పాపన్నపేట(మెదక్): పాపన్నపేట పంచాయతీ తైబజార్, గింజల బజార్ వేలం పాటల ఆదాయం రూ. 5.29 లక్షలు వచ్చినట్లు పంచాయతీ కార్యదర్శి నయీం తెలిపారు. సోమవారం నిర్వహించిన వేలం పాటల్లో తైబజార్ కు రూ.5.06 లక్షల వేలం పాట అఫ్రోజ్ పేరిట ఖరారు కాగా, గింజల బజార్ రూ. 23 వేలకు దోమకొండ కిషన్‌రెడ్డి పేరిట వేలం ఖరారు అయింది. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి సురేష్‌బాబు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మాల జంగం జిల్లా అధ్యక్షుడుగా దేవలింగం



శివ్వంపేట(నర్సాపూర్): మాల జంగం ఉమామహేశ్వర సంఘం జిల్లా అధ్యక్షుడిగా మండల పరిధిలోని కొంతన్‌పల్లి గ్రామానికి చెందిన దేవలింగం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం సాయంత్రం మాల జంగం జిల్లా సమావేశం తూప్రాన్‌లో నిర్వహించగా తనను జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకున్నట్లు దేవలింగం తెలిపారు. తనపై నమ్మకంతో జిల్లా బాధ్యతలు అప్పగించిన వారందరికి కృతజ్ఞతలు చెప్పారు. మాల జంగం సమస్యల పరిష్కారం కోసం తనవంతు కృషి చేస్తానన్నారు.

కార్మికుడికి న్యాయం చేయండి



పురుగు మందు డబ్బాతో నిరసన తెలుపుతున్న బాధిత మహిళ

చిన్నశంకరంపేట(మెదక్): పరిశ్రమలో పనిచేస్తూ ప్రమాదానికి గురైన కార్మికుడికి న్యాయం చేయాలని కోరుతూ మండల కేంద్రంలోని సోలార్ పరిశ్రమ ఎదుట బాధిత కుటుంబ సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. సోమవారం మైత్రి సోలార్ పరిశ్రమ వద్దకు తరలివచ్చిన పొలంపల్లి గ్రామస్తులు బాధిత కుటుంబంతో కలిసి పరిశ్రమ ప్రధాన ద్వారానికి తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. గతేడాది ఆగస్టులో పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో కార్మికుడు మల్లేశం తలకు తీవ్ర గాయమైంది. దీంతో ఆస్పత్రిలో చేర్పించి వైద్యంకోసం అడ్వాన్స్ చెల్లించిన పరిశ్రమం అటువైపు చూడలేదు. కోమాలోకి వెళ్లిన మల్లేశం వైద్య ఖర్చులను అప్పులు చేసి చెల్లించినట్లు భార్య శిరీష తెలిపింది. కార్మికుడి వైద్య ఖర్చులు స్థానికులు ఎన్నిసార్లు అడిగినా వాయిదా వేస్తూ జరుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ విషయంపై ప్లాంట్ సిబ్బంది మాట్లాడుతూ.. యజమాని దృష్టికి సమస్యను తీసుకువెళ్లి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

యువత సమాజసేవలో ముందుండాలి

కౌడిపల్లి(నర్సాపూర్): విద్యార్థులు, యువత సమాజసేవలో ముందుండాలని తునికి వద్దగల డాక్టర్ డీ రామానాయుడు విజ్ఞానజ్యోతి వ్యవసాయ కళాశాల డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని తునికి గ్రామంలో సంగారెడ్డి జిల్లా కంది వద్దగల వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్ శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడుతూ.. మారుమూల గ్రామాల్లో విద్యార్థులు ఎన్ఎస్ఎస్ శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని చెప్పారు. విద్యార్థులు, యువత సమాజంపై అవగాహనతో పాటు క్రమశిక్షణ, మంచి, చెడు, సేవాభావం తెలుస్తాయన్నారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ శిబిరంలో మొదటి రోజు విద్యార్థులు పర్యావరణ పరిశుభ్రత, ఆరోగ్యం, ఇంటి వద్ద కూరగాయల పెంపకం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కేవీకే హెడ్‌అండ్ సైంటిస్ట్ శంభాజీ దత్తాత్రేయ నల్కర్, కంది వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల అసోసియేట్ డీన్ మనోజ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు రమేశ్, హరి, కేవీకే శాస్త్రవేత్తలు రవికుమార్, ప్రతాప్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు, సాయిలు, సాయాగౌడ్, మాజీ ఉపసర్పంచ్ కొండల్‌రెడ్డి 51మంది ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై దృష్టి పెట్టండి

శివ్వంపేట(నర్సాపూర్): సీఎం, మంత్రులు, నాయకులు బీఆర్ఎస్ నాయకులపై విమర్శలు మాని అభివృద్ధిపై దృష్టి పెట్టాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమణగౌడ్, నాయకులు మహేశ్‌గుప్తా, చంద్రగౌడ్, యాదగౌడ్ అన్నారు. సోమవారం శివ్వంపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పథకం ప్రకారం అసెంబ్లీ నుంచి అక్రమంగా జగదీశ్వర్‌రెడ్డిని సస్పెండ్ చేయడం దారుణమన్నారు. ప్రశ్నించే గొంతులను అణచివేసే దోరణిలో ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తూ మోసం చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మీనర్సయ్య, మహిపాల్‌రెడ్డి, లక్ష్మణ్, భిక్షపతిరెడ్డి, నాగరాజు తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

తునికి నల్లపోచమ్మ జాతర ప్రారంభం



నల్లపోచమ్మదేవి జాతరకు తునికి గ్రామం నుంచి బొట్టు, పసుపు ఎదుర్కొస్తున్న గ్రామస్తులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి నల్లపోచమ్మ జాతర సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ఆలయ ఈఓ రంగారావు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు శివప్ప, రాజేశ్, విఘ్నేశ్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. జాతర సందర్భంగా ఆలయ అధికారులు, గ్రామస్తులు గ్రామంలోని వతన్‌దారులను ఇంటివద్ద నుంచి మేళ తాళాలతో బొట్టు, పసుపు ఎదుర్కొళ్లు నిర్వహించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. జాతర సందర్భంగా భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేస్తున్నట్లు ఈఓ రంగారావు తెలిపారు. పూలు, విద్యుత్ దీపాలతో ఆలయాన్ని అందంగా అలంకరించారు. భక్తులకు నీటి వసతి కల్పించారు. ఎండ వేడిమి అధికంగా ఉండటంతో ఆలయం వద్ద భక్తులకు ఇబ్బందులు లేకుండా చలువ పందిరి ఏర్పాటు చేశారు. స్థానిక ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి ఆధ్వర్యంలో రెండు వైపుల పోలీసులు చెక్‌పోస్ట్ ఏర్పాటు చేసి బందోబస్త్ చేశారు. వైద్య సిబ్బంది ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఆలయ అధికారులు వెంకట్‌రెడ్డి, మాజీ ఆలయ కమిటీ సభ్యులు, మాజీ సర్పంచ్‌లు ఇతర ప్రజాప్రతినిధులు భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నారు.

నత్నయ్యపల్లి బస్సును పునరుద్ధరించండి

నర్సాపూర్ రూరల్: నర్సాపూర్ నుంచి నత్నయపల్లి మీదుగా పటాన్ చెరువు బస్సును పునరుద్ధరించాలని మండలంలోని రత్నయ్యపల్లి అఖిలపక్ష పార్టీ నాయకులతో పాటు గ్రామస్తుల ఆధ్వర్యంలో నర్సాపూర్ బస్ డిపో ఇన్‌చార్జి లక్ష్మణ్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. షేర్ఖాన్‌పల్లి నుంచి రత్నయ్యపల్లి, కొండాపూర్ వరకు ఉన్న బీటీరోడ్డు పూర్తిగా ధ్వంసం కావడంతో గోతులు ఏర్పడ్డాయి. దీంతో కొన్ని నెలలుగా ఈ రూట్లో బస్సులు నిలిపివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. బస్సులో నిలిపివేయడంతో నిత్యం నర్సాపూర్, పటాన్‌చెరువు ఇతర గ్రామాల విద్యార్థులు పాఠశాలలు, కళాశాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలుమార్లు అధికారులు, నాయకులకు విన్నవించినా.. పట్టించుకోవడం లేదన్నారు. సొంతంగా రోడ్డుపై ఏర్పడిన గోతులను మట్టితో పూడ్చినప్పటికీ బస్సులు నడపడం లేదని తెలిపారు. ఎప్పటికైనా డిపో అధికారులు ఈ రూట్లో బస్సులు నడపాలని కోరారు. ఈ కార్యక్రమంలో నత్నయ్యపల్లి గ్రామమాజీ సర్పంచ్ సత్యనారాయణ, కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఉదయ్, బీజేపీ మండలాధ్యక్షుడు నీలి నగేశ్, మహేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న నత్నయ్యపల్లి గ్రామస్తులు

సంక్షిప్త వార్తలు

◆ ఆలయానికి ఏసీ అందజేత

నర్సాపూర్: పట్టణంలోని రాజరాజేశ్వర దేవాలయానికి పట్టణానికి చెందిన సంగసాని నర్సింగ్‌రావు లావణ్య దంపతులు సోమవారం ఏసీ అందజేశారు. ఈ సందర్భంగా స్వామివారికి ఆలయ అర్చకుడు వీరప్ప అభిషేకం తదితర పూజలు చేశారు. అనంతరం నర్సింగ్‌రావు దంపతులకు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.

◆ చదువులో రాణించాలి

శివ్వంపేట(నర్సాపూర్): విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ కోసం చదువులో రాణించాలని కృషి విజ్ఞాన్ గ్రామీణ అభివృద్ధి సంస్థ చైర్మన్ లక్ష్మీకాంతారావు అన్నారు. మండల పరధిలోని దొంతి గ్రామానికి చెందిన భవనగారి శ్రీనివాస్ 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, స్టేషనరీ సామగ్రి సోమవారం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఆనంద్, రాహుల్, నాగరాజు, సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.

◆ మల్లికార్జునస్వామి ఉత్సవాల్లో మైనంపల్లి

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని శాలిపేట గ్రామంలో నిర్వహించిన మల్లికార్జునస్వామి ఆలయ వార్షికోత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు పాల్గొని పూజలు నిర్వహించారు. సోమవారం మల్లికార్జుస్వామి కల్యాణోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సత్యనారాయణ, అంజాగౌడ్, యాదవ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

◆ దైవనామ స్మరణతో సమస్యలు దూరం

పాపన్నపేట(మెదక్): దైవనామ స్మరణతో సమస్యలు దూరమవుతాయని రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతి అన్నారు. సోమవారం మండలంలోని నాగ్సాన్‌పల్లిలోని ఉమా కేదారీశ్వర ఆలయంలో ఆయన పూజలు నిర్వహించారు.

◆ కొత్తపేటలో పంపుసెట్లు చోరీ

శివ్వంపేట(నర్సాపూర్): వ్యవసాయ పొలం వద్ద ఉంచిన బోరుబావి మోటార్లు, ఇతర సామగ్రి చోరీ చేసిన సంఘటన మండలంలోని కొత్తపేటలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన సత్యనారాయణ, రాంరెడ్డిలకు చెందిన పంపుసెట్లు కాలిపోవడంతో బోరుబావుల్లో నుంచి తీసి పొలం వద్దనున్న గదిలో భద్రపరిచారు. ఆదివారం అర్ధరాత్రి పలువురు రాంరెడ్డికి చెందిన 5 హెచ్‌పీ మోటారు, సత్యనారాయణకు చెందిన మోటారు, పంపు, ఇతర వ్యవసాయ సామగ్రి చోరీ చేశారు. చోరీకి పాల్పడిన ఆరు మంది అనుమానిత వ్యక్తుల పేర్లతో బాధిత రైతులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

◆ ఘనంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని కొట్టాలలో శివపంచాయతన ఆంజనేయస్వామి యంత్ర, విగ్రహ ప్రతిష్ఠ సోమవారం ఘనంగా జరిగింది. మూడు రోజులుగా సంగారెడ్డి జిల్లా ఫసల్‌వాదివద్దగల శ్రీజ్యోతిర్వాస్తు విద్యపీఠం వ్యవస్థాపకుడు డాక్టర్ మహేశ్వరశర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో గ్రామ పురోహితులు మెట్టురాములుశర్మ, వేదపండితులు విగ్రహ ప్రతిష్ఠను ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఆంజనేయస్వామితో పాటు శివ పంచాయత విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

◆ యాజమాన్య పద్ధతులు పాటించాలి

శివ్వంపేట(నర్సాపూర్): ప్రస్తుత యాసంగి సీజన్‌లో వరి పంట చేతికి వచ్చే ముందు రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయ అధికారి లావణ్య అన్నారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో వరిపంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ప్రస్తుతం వరిపంట పొట్ట దశ నుంచి గింజ గట్టిపడే దశలో ఉందని ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందున 3 నుంచి 5 సెంటిమీటర్ల వరకు నీటి లభ్యత ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

◆ అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం చేసే యత్నం

నర్సాపూర్ రూరల్: మండలంలోని ఎల్లాపూర్‌లో అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసేందుకు ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు యత్నించారు. సోమవారం ఉదయం గ్రామ అంబేడ్కర్ సంఘం సభ్యులు విగ్రహాన్ని పరిశీలించి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో నర్సాపూర్ ఎస్‌ఐ లింగం పోలీస్ సిబ్బందితో కలిసి గ్రామానికి చేరుకొని ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు ఎస్‌ఐ లింగం తెలిపారు. ఎల్లాపూర్‌లో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆయా సంఘాల నేతలు, సభ్యులు బాధ్యులను గుర్తించి చట్టపరమైనచర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని, పోలీసులను కోరారు.

◆ ఉద్యోగాలు ప్రకటించొద్దు

మనోహరాబాద్(తూప్రాన్): ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ జరిగేవరకు రాష్ట్రం నూతనంగా ప్రవేశపెట్టిన గ్రూప్ ఫలితాలను నిలిపివేయాలని జాతీయ ఎమ్మార్పీఎస్ ఉపాధ్యక్షుడు యాదగిరి మాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మురళి ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక దీక్షలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వీరి వెంట జిల్లా అధికార ప్రతినిధి సుధాకర్, మండల ప్రతినిధి అశోక్, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్, ఉపాధ్యక్షుడు ప్రవీణ్, గ్రామాధ్యక్షుడు శ్రీనివాస్, గణేశ్, నిరంజన్‌దాస్, నర్సింగరావు, తదితరులు పాల్గొన్నారు.

◆ ఎయిడ్స్‌పై అవగాహన తప్పనిసరి

మెదక్ కలెక్టరేట్: ప్రతి ఒక్కరూ ఎయిడ్స్ మహమ్మారిపై అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని సుఖ వ్యాధుల కౌన్సిలర్ రాజేశ్వర్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని హెడ్ పోస్టాఫీస్ వద్ద లేబర్ అడ్డాపై కూలీలకు హెచ్ఐవీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కూలీలకు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీటీసీ కౌన్సిలర్ గోపి, స్టాఫ్‌నర్స్ ఎల్లమ్మ, తదితరులు పాల్గొన్నారు.

◆ అభివృద్ధికి పెద్దపీట

కొల్చారం(నర్సాపూర్): కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తుందని నర్సాపూర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని రంగంపేటలో ఎన్ఆర్ఈజీఎస్ నిధుల కింద రూ.2.50 లక్షలతో వేయనున్న సీసీరోడ్డు పనులను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట జిల్లా పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, మండలాధ్యక్షుడు మల్లేశంగౌడ్, ఉపాధ్యక్షుడు గోవర్ధన్, గ్రామాధ్యక్షుడు కృష్ణ, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, వెంకట్ గౌడ్, రాజు, దుర్గేశ్ గౌడ్, శ్రీశైలం పాల్గొన్నారు.

◆ ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

పెద్దశంకరంపేట(మెదక్): ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని నిజామాబాద్ జిల్లా మల్లారం లింగేశ్వర గుట్ట బాలయోగి కృష్ణ మహారాజ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఆరేపల్లిలో నూతనంగా నిర్మించిన శివాలయ విగ్రహ ప్రతిష్ఠలో ఆయన పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
కె. లక్ష్మణ్
9502735264